క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని డోర్నకల్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో అవుట్ సోర్సింగ్‌లో టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. టీజీటీ ఇంగ్లిష్, పీజీటీ సోషల్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పీజీ పూర్తి చేసి, బీఈడీ ఉత్తీర్ణత, సోషల్ సబ్జెక్టుల తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. మూడు సంవత్సరాల టీచింగ్ అనుభవం తప్పనిసరిగా ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విద్యార్హత జిరాక్స్ కాపీలను పైన తెలిపిన తేదీలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మానుకోట జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని, వివరాలకు 73966 91373, 98859 83942 ఫోన్ నంబర్లు సంప్రదించాలన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

నెహ్రూసెంటర్: కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్న మోదీ పాలనకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి బి.మధు అన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన మండల కేంద్రాల్లో, 10వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే మహాపడావ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకుడు ఆకుల రాజు, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, సమ్మెట రాజమౌళి, శ్రీనివాస్, వీరన్న, మల్లయ్య, మౌనిక, శ్రీశైలం పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పిస్తాం..

డోర్నకల్: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కిసాన్ పరివార్ అధ్యక్షుడు నానావత్ భూపాల్‌నాయక్ తెలిపారు. స్థానిక రైల్వే ఫంక్షన్ హాలులో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. అనంతరం ఉద్యోగం పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం భూపాల్ నాయక్ మాట్లాడుతూ.. తనకు ఇప్పటి వరకు రాజకీయాలతో సంబంధం లేదని, ఇక్కడి పరిస్థితులు పరిశీలించిన తరువాత మార్పు కోసం తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. తనకు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయని, వారిని కలుపుకుని నియోజకవర్గ మార్పు కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. మున్నేరువాగు శివారు శివాలయ అభివృద్ధికి భూపాల్‌నాయక్ రూ.లక్ష విరాళం అందించారు.

నష్ట పరిహారం చెల్లించాలి

గార్ల: భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ వీరన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మనోహర్, వీరభద్రం, సక్రు చిన్న, వీరు పాల్గొన్నారు.

వైద్యాధికారి విచారణ

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో మంగళవారం ఓ వ్యక్తి మృతిపై జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌రెడ్డి విచారణ జరిపారు. గత నెల 30వ తేదీన గాలం భద్రయ్య(53) కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మరణానికి మూడు రోజుల ముందు భద్రయ్య జ్వరం బారిన పడ్డాడు. దీనిపై డాక్టర్ సుధీర్‌రెడ్డి విచారణ జరిపి అనారోగ్యానికి గురైన భద్రయ్యను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ, సీహెచ్‌ఓ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్.. ఎమ్మెల్యే శంకర్‌నాయక్



నెహ్రూసెంటర్: ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయగా జిల్లాలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆర్టీసీ బస్సును నడిపి డ్రైవర్లలో ఉత్సాహం నింపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

కురవి: మండలంలోని మోద్గులగూడెం శివారు జుజ్జూర్ తండాకు చెందిన భూక్య బిచ్చు మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై కురవి నుంచి మోద్గులగూడేనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కురవి శివారులో నర్సింహరావు తోట వద్ద రాత్రి వేళ మట్టి కుప్పలు కనిపించక పోవడంతో బైక్ కుప్పలను ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయమైంది. 108లో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషమంగా ఉండడంతో ఖమ్మం తరలించారు.

హాస్టళ్లను ప్రారంభించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

మహబూబాబాద్ అర్బన్: మోడల్ స్కూల్ వసతి గృహాన్ని తక్షణమే ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా క్యాదర్శి కేలోత్ సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అనంతారం మోడల్ స్కూల్ వసతి గృహాన్ని ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా క్యాదర్శి కేలోత్ సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్న మోడల్ స్కూల్ వసతి గృహాన్ని ఎందుకు ఓపెన్ చేయడంలేదన్నారు. విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి సూర్యప్రకాష్, నాయకులు తరుణ్, అజయ్, ప్రియాంక పాల్గొన్నారు.

కురవి: జిల్లాలో ఉన్న మోడల్ స్కూల్ హాస్టళ్లను వెంటనే ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ మరిపెడ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు అన్నారు. మంగళవారం మండలంలోని నేరడ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్, మనోజ్, యాకూబ్, మురళి పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: నిరసన తెలియజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తొర్రూరు రూరల్: ఆదర్శ పాఠశాలల్లో వసతి గృహాలను ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అన్నారు. విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండలంలోని గుర్తూరు మోడల్ స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సంఘ మండల కార్యదర్శి అమీర్, నాయకులు గుంశావళి, సుధీర్, మహేష్ పాల్గొన్నారు.



కురవి: నేరడ మోడల్‌స్కూల్ హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మరిపెడ: స్థానిక మోడల్‌స్కూల్‌లో నిర్మించిన హాస్టల్‌ను ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు వీరబాబు మాట్లాడుతూ.. హాస్టల్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు ప్రారంభించక పోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, ఉదయ్, వసంత్, దిలీప్ పాల్గొన్నారు.

ఇదేనా పిల్లలకు మీరు చెప్పే చదువు..

- పిల్లలకు కనీసం ఎక్కాలు కూడా రావడం లేదు..
- కేజీబీవీలో టీచర్ అవతారమెత్తిన ఎమ్మెల్యే శంకర్‌నాయక్

నెల్లికుదురు: ఇదేనా పిల్లలకు మీరు చెప్పే చదువు.. 9, 10 వతరగతి పిల్లలకు కనీసం ఎక్కాలు కూడ రావడంలేదని, ఇంగ్లిష్ అడిగితే టీచర్ లేదంటారు.. అని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కేజీబీవీ ప్రత్యేక అధికారి సుమలత, ఉపాధ్యాయునిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పాఠశాలలో ఇప్పటి వరకు ఇంగ్లిష్ టీచర్ లేకపోవడం ఏంటని ప్రత్యేక అధికారి సుమలతను ప్రశ్నించారు. వెంటనే డీఈఓకు ఎమ్మెల్యే ఫోన్ చేసి అడిగితే ఇంగ్లిష్ టీచర్ లేదని నాకు ఎలాంటి సమాచారం లేదని చెప్పడంతో మండిపడ్డారు. పాఠశాల ఆవరణంలోని ప్రహరీ కూలి చెరువు నీరు పాఠశాల ఆవరణంలోకి వచ్చి దుర్వాసన వస్తుందన్నారు. పాఠశాల గదులన్నీ కురుస్తున్నాయని ఎమ్మెల్యే గదులన్ని పరిశీలించి పాఠశాల పైకి ఎక్కి పరిశీలించారు. పాఠశాల నిర్మించిన కాంట్రాక్టర్‌ను ఉరితీయాలన్నారు. కేజీబీవీ పాఠశాల నిర్మించి 10 ఏళ్లు కాలేదని ఇప్పటికే పగుళ్ల బారిన పడి గదులన్నీ కురుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సీడీఎఫ్ నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తానని, కలెక్టర్‌తో మాట్లాడి త్వరలోనే పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.



కేజీబీవీ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 12మందికి రూ.3.60లక్షలు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ యాదగిరిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ: దేశానికి అన్నం పెట్టే రైతులను కష్టాల పాలు చేయవద్దని, వారికి ఉన్న విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ విద్యుత్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుగులోతు అరుణ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా మండలంలోని కోట్యతండా సర్పంచ్ తేజావత్ పూరి ఇటీవల మృతి చెందడంపై ఆమెకు రెండు నిమిషాలపాటు సభలో మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మరిపెడ విద్యుత్ శాఖ ఏఈ పావని కనీసం ఫోన్ ఎత్తడం లేదని పలువురు సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోవడంతో ఏఈపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లోని ఇబ్బందులు ఏర్పడ్డ వివరాలను సేకరించి 15 రోజుల్లో సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొందరు పని చేతకాని అధికారుల తీరుతోనే ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, జెడ్పీటీసీ తేజావత్ శారద, వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ గుగులోతు సింధూర రవికుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 25కోట్ల నిధులకు సంబంధించిన పనులకు వెంటనే టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, కమిషనర్ రాజు, కౌన్సిలర్లు ఎడెల్లి పరశురాములు, కిషన్, వుప్పల నాగేశ్వర రావు, మక్సూద్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈఓ విచారణ

గూడూరు: మండలంలోని పొనుగోడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇటీవల జరిగిన పలు గందరగోల సంఘటనలపై మంగళవారం ఎంఈఓ శ్రీదేవి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కాంతారావు విచారణ జరిపారు. సర్పంచ్ నలమాస వెంకన్నగౌడ్, గ్రామస్తులు, తల్లిదండ్రుల సమక్షంలో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పాఠశాల హెచ్ఎం పూల్‌సింగ్‌పై జిల్లా అధికారులకు చేసిన పలు ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. ఈసందర్భంగా హెచ్ఎంపై ఫిర్యాదు చేసిన ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఏ ఒక్క ఆధారము చూపలేదని, కావాలని వ్యక్తిగతంగా హెచ్ఎంపై ఫిర్యాదు చేసినట్లు గుర్తించారు. విచారణ నివేదికను మొత్తం జిల్లా అధికారులకు పంపించామని ఎంఈఓ శ్రీదేవి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కాంతారావు తెలిపారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

గూడూరు: పుట్టిన బిడ్డకు గంటలోపు తప్పకుండా తల్లిద్వారా వచ్చే ముర్రుపాలను తాగిస్తే వారిలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. మండలంలోని జగన్నాయకులగూడెం, గోవిందాపురం, గూడూరు-1 లతో పాటు పలు గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు.

తాటిచెట్ల నరికివేతపై ఆందోళన



ఆందోళన చేస్తున్న గీత కార్మికులు

కురవి: సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామ శివారులోని తాటి వనంలో తాటి చెట్లను సోమవారం నరికేసిన సంఘటనపై మంగళవారం గీత కార్మికులు తాటివనంలో ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తాళ్లసంకీస శివారులోని తాటి వనంలో పనికిరాని చెట్లను తొలగించేందుకు గౌడ సర్పంచ్‌లు, కులస్తులు, గీతకార్మికులు 12 మంది సోమవారం తాళ్లసంకీస గ్రామంలో చేనుకు సంబంధించిన కొండపల్లి శ్రీదేవితో ఒప్పందం కుదుర్చుకున్నారు. మంగళవారం గౌడలు తాటి వనంలోకి వెళ్లి చూసిన తాటిచెట్లు నరికివేసి ఉండడంతో ఆందోళనకు దిగారు. దీంతో సంఘటన విషయం తెలిసి ఎక్సైజ్ ఎస్సై హనుమంతరావు నేతృత్వంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గీత కార్మికులు వెంకటమల్లు, శ్రీను, ఆవెంకటేశ్, మహేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

గూడూరు: వర్షాకాలంలో ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత పాటించాలని సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ సంపత్, కార్యదర్శి భీమానాయక్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీఓ రవీందర్‌రావు తెలిపారు. ఎంపీపీ వోలం చంద్రమోహన్‌తోపాటు, పలువురు అధికారులు సర్పంచ్, ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు.

కాలేజీ మంజూరుతో నెరవేరిన కల

మహబూబాబాద్: హార్టికల్చర్ డిగ్రీ కాలేజీ మంజూరుతో జిల్లా ప్రజల చిరకాల వాంఛ, కల నెరవేరిందని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఎమ్మెల్యేతో పాటు నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కాగా నెహ్రూసెంటర్‌లో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, జెడ్పీటీసీ ప్రియాంక, నాయకులు రవి, మార్నేని వెంకన్న, మురళీధర్‌రెడ్డి, అశోక్, రాజు, వెంకన్న, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: ఉద్యాన డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జేవీఆర్ హెచ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త భాస్కర్, శాస్త్రవేత్త ప్రశాంత్, సర్పంచ్ ఆవుల కుమారివెంకన్న, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

వరద బాధితులకు బియ్యం అందజేత



కేసముద్రం: బియ్యం అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామంలో వట్టివాగు వరద బాధితులను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి మంగళవారం 50 బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 25కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, కేసముద్రం సొసైటీ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, బండారు వెంకన్న పాల్గొన్నారు. మండలంలోని ధన్నసరి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు మంగళవారం సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీవాణిరవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో 25 కేజీల చొప్పున బియ్యం అందజేశారు.

దుప్పట్ల పంపిణీ

మండలంలోని అర్పనపల్లి గ్రామంలో ఇటీవల వట్టివాగు వరద ఉధృతికి వడ్డెరకాలనీలో ఇళ్లు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈమేరకు మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి కుమారులు వేం చేతన్, చరణ్ పంపించిన దుప్పట్లను, మంగళవారం బాధిత కుటుంబాలకు సర్పంచ్ గంధసిరి స్వరూప సోమన్న చేతుల మీదుగా అందజేశారు.

మానవత్వం చాటుకోవాలి

గూడూరు: ఆపదలో ఉన్నవారికి సహాయపడుతూ మానవత్వం చాటుకోవాలని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండల కేంద్రానికి చెందిన 2003-04 సంవత్సరానికి చెందిన 10వ తరగతి మిత్రులు ములుగు జిల్లాలోని వరద బాధితులకు 5క్వింటాళ్ల బియ్యం మంగళవారం ఎమ్మెల్యే సీతక్క చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురేందర్, రమేష్, రాకేష్, చిరంజీవి, కార్తీక్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పనులు త్వరగా పూర్తి చేయాలి

మహబూబాబాద్: మిషన్ భగీరథ పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మిషన్ భగీరథ పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసన్నరాణి, డీఈ సీహెచ్ ఉపేందర్ పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంజిత్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

గూడూరు: మండలంలోని వెంగంపేట, చిన్న ఎల్లాపురం, భూపతిపేట, సీతానగరం, కోబల్‌తండా గ్రామాలకు సీసీ రోడ్లు, సైడ్ కాల్వలు, లోలెవల్ కాజ్‌వేల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ నాయకులు శోభన్‌రెడ్డి, మన్మోహన్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

తహసీల్దార్‌కు వినతి

కేసముద్రం: జనగణనలో కులగణన చేపట్టాలంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంసీపీఐ(యు), ఏఐసీటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ సాంబశివుడికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎల్లయ్య, బిచ్చానాయక్, మాధవచారి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

తొర్రూరు రూరల్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని డీపీఎంఓ చెప్యాల వనాకర్‌రెడ్డి, సీహెచ్ఓ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మాటేడు గ్రామ పంచాయతీ ఆవరణలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు.

డ్రైవర్ల నిరసన

నెహ్రూసెంటర్: ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమానికి వాహనాలను ఏర్పాటు చేసిన వాహనదారులు తమకు రావాల్సిన బిల్లులను చెల్లించాలని మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: వర్షాలతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కురవి: విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మోద్గులగూడెం జెడ్పీహైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థి సంఘాలను, మీడియాను పాఠశాలలు, కళాశాలలకు, వసతిగృహాల్లోకి వెళ్లనీయకుండా చేయడం అన్యాయమన్నారు. బానోత్ సాయి, వంశీ పాల్గొన్నారు.

9న బోనాలు

గార్ల: గార్ల పట్టణంలో ఈనెల 9 వ తేదీన బోనాల పండుగ నిర్వహించాలని కుల సంఘాల నాయకులతో చర్చించి తీర్మానం చేసినట్లు సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ మంగళవారం తెలిపారు.

జయప్రదం చేయండి

దంతాలపల్లి/నర్సింహులపేట: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన కార్మికుల గర్జనను జయప్రదం చేయాలని మంగళవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థల మండల అధ్యక్షుడు కొమురయ్య, సూరయ్య, బిక్షం, నారాయణ, పరశరాములు, మధు, సూరయ్య పాల్గొన్నారు.

నిధుల డ్రా అవాస్తవం

నర్సింహులపేట: నిధులను పంచాయతీ కార్యదర్శి డ్రా చేశాడనే ఆరోపణలు అవాస్తవం అని పెద్ద నాగారం సర్పంచ్ పులిచింత కళమ్మ తెలిపారు. మంగళవారం జీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కొందరు కావాలనే నిధులు డ్రా జరిగినట్లు ప్రచారం చేస్తున్నారని, ఏ ఒక్క రుపాయి దుర్వినియోగం కాలేదన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

మహబూబాబాద్ రూరల్: అధిక శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీవేణు గోపాల స్వామివారి దేవాలయంలో శ్రీసుదర్శన యజ్ఞం పూజా కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణ చార్యులు ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కూలి రేట్లు పెంచాలి

చిన్నగూడూరు: వ్యవసాయ కార్మికులకు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వీరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న మంగళవారం డిమాండ్ చేశారు.

నల్లబెల్లం పట్టివేత

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు హట్యతండాలో 4 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటిక పట్టుకున్నట్లు సీరోలు ఎస్సై రమాదేవి మంగళవారం తెలిపారు. హట్యాతండాకు చెందిన మాలోత్ భద్రు అనే వ్యక్తి ఇంటిపై సోమవారం రాత్రి దాడి చేయడం జరిగిందని తెలిపారు. మాలోత్ భద్రు, మాలోత్ స్వామి, ఇస్లావత్ రాజులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కదనభేరికి తరలిన నాయకులు

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్‌లో జరుగుతున్న ఏబీవీపీ తెలంగాణ విద్యార్థి కదనభేరికి మానుకోట ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు వెళ్తున్న క్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోసంగి మురళి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు జిల్లా కన్వీనర్ అచ్చు సుజిత్, పట్టణ కార్యదర్శి రేవంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

బయ్యారం: భారీ వరదల కారణంగా పంటభూములు కోతకు, ఇసుకమేటకు గురై నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఏఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు మంగళవారం డిమాండ్ చేశారు. మురళి, వెంకన్న, వెంకటనర్సు, సత్యం పాల్గొన్నారు.

నూతన పంచాయతీలుగా ప్రకటించాలి

తొర్రూరు: మండలంలోని కిష్టాపురం, చంద్రు తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ప్రకటించాలని ఆయా గ్రామాల నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సింగారపు కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నకిరెకంటి కొమురయ్య, నాయకులు యాకయ్య, ఆంజనేయులు, మధు పాల్గొన్నారు.

చెక్ డ్యాంను పరిశీలించిన ఎస్ఈ

నర్సింహులపేట: మండలంలోని ముంగిమడుగు శివారు ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం భారీ వర్షాల ఉధృతికి ఒక వైపు తెగిపోయింది. మంగళవారం ఐబీ ఎస్ఈ వెంకటేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ సుదర్శన్ రావు, డీఈ రాజ్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ డీఈ లక్ష్మణ్‌రావు, ఏఈ సుశ్మ, సర్పంచ్ మెరుగు శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి

పెద్దవంగర: విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. ప్రత్యేకాధికారి శ్రవంతి, సీఆర్‌పీ రంగన్న, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవంగర: ఓపెన్ స్కూల్‌లో ఎస్సెస్సీ, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 10 వరకు ప్రవేశం పొందవచ్చన్నారు. 94904 52794 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అన్నదానం

తొర్రూరు: లయన్స్ టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో దినసరి కూలీలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ డాక్టర్ వి.శారద, చార్టర్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ ఆటోడ్రైవర్ల దినోత్సవం



మహబూబాబాద్: కేక్ కట్ చేస్తున్న మురళీధర్‌రెడ్డి



కేసముద్రంలో ఆటో కార్మికులకు యూనిఫాంలను అందజేస్తున్న ఎస్సై తిరుపతి

సాక్షి నెట్‌వర్క్: ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, తెలంగాణ ఆటో డ్రైవర్ల యూనియన్(తాడు) జిల్లా గౌరవ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి యూనియన్ జెండా ఆవిష్కరించారు. కేసముద్రంలో ఆటో కార్మికులకు ఎస్సై తిరుపతి యూనిఫాంలను అందజేశారు.

‘పెట్రోల్‌లో నీళ్లు కలవలేదు’

మరిపెడ: మండలం కేంద్రంలోని శ్రీరామ ఫిల్లింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ బంకు పెట్రోల్‌లో ఎలాంటి నీళ్లు కలవలేదని ఇండియన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ కేఎల్‌వీవీ ప్రసాద్ అన్నారు. మండలంలోని శ్రీరామ ఫిల్లింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ బంకులో కొందరు వినియోగదారులు నీళ్లు వస్తున్నాయని సోమవారం బంకు ఎదుట నిరసన చేయడంతో పాటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ భూక్య నంద, ఫిర్యాదుదారుల ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ సెల్స్ ఆఫీసర్ కేఎల్‌వీవీ ప్రసాద్ వాటర్ ఫైండింగ్ టెస్ట్ చేశారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

గార్ల: గార్ల మండలంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మె మంగళవారం కు 27వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు బండ్ల అప్పిరెడ్డి, దాసు, రమేష్, కిషన్‌నాయక్, దస్తగిరి పాల్గొన్నారు.

గూడూరు: సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్, సత్యనారాయణ, రాజు, వీరమల్లు, ఐలయ్య, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

కురవి: ప్రతీ ఒక్క విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కురవి పీహెచ్‌సీ డాక్టర్ విరాజిత అన్నారు. సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సురేందర్, మౌనిక, సుమతి, ఏఎన్ఎం పాల్గొన్నారు.